నమస్తే తెలంగాణ
నల్లగొండ
8 | నల్లగొండ, సోమవారం 2 జూన్ 2025 | NALGONDA




• బుద్ధవనాన్ని సందర్శించిన బౌద్ధ భిక్షువులు

నందికొండ, జూన్ 1: ప్రపంచ పర్యాటక ప్రాంతమైన నాగార్జునసాగర్‌లో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించిన హిల్‌కాలనీలోని బుద్ధవనాన్ని థాయిలాండ్ బౌద్ధభిక్షువులు, అంతర్జాతీయ నటులు, సిద్ధార్థ గౌతమ పాత్రధారి గగన్‌మాలిక్ ఆధ్వర్యంలో ఆదివారం సందర్శించారు. గౌతమబుద్ధుడి పాదాలకు పుష్పాంజలి ఘటించి పూజలు నిర్వహించారు. అనంతరం బుద్ధవనంలోని మ్యూజియం, గోపురంపై అమర్చిన శిల్పాలు, స్థూపపార్కు, ధ్యానవనం, బుద్ధ చరితవనం, మహాబుద్ధ స్తూపాన్ని సందర్శించి ధ్యాన మందిరంలో ధ్యానం చేశారు.

## మహిళలు, విద్యార్థినుల రక్షణకు ప్రాధాన్యం

సూర్యాపేటటౌన్, జూన్ 1: మహిళలు, బాలికలు, విద్యార్థినుల రక్షణకు సూర్యాపేట జిల్లా పోలీసు యంత్రాంగం అధిక ప్రాధాన్యత ఇస్తుందని జిల్లా ఎస్పీ నరసింహ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్మార్ట్‌ఫోన్ అందుబాటులో ఉండటం వల్ల సోషల్ మీడియా ప్రభావం యువతపై అధికంగా ఉందన్నారు. ఇందులో నుంచి మంచి నేర్చుకుని చెడును వదిలేయాలని సూచించారు. 18 ఏండ్లలోపు వారిపై వేధింపులకు పాల్పడితే పోక్సో చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని చెప్పారు. మహిళలు, విద్యార్థినుల రక్షణకు పోలీసుశాఖ షీ టీమ్స్, కళా బృందాలతో విద్యా సంస్థలు, కాలనీలు, రద్దీ ప్రాంతాల్లో నూతన చట్టాలు, జైలు శిక్షలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. పోక్సో కేసుల్లో కఠిన శిక్షలు పడుతాయన్నారు. విద్యార్థులు ఎలాంటి ఆకర్షణలకు లోను కాకుండా చదువుపై దృష్టి పెట్టి ఉన్నత స్థాయిలో నిలువాలని కోరారు. తల్లిదండ్రులు పిల్లల నడవడికను నిత్యం గమనించాలన్నారు. పోలీసు శాఖ సహకారంతో విద్యాసంస్థల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.



## డల్లాస్‌లో కేటీఆర్‌కు ఘన స్వాగతం



బీబీనగర్, జూన్ 1: అమెరికా పర్యటనలో భాగంగా డల్లాస్ చేరుకున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు బీఆర్‌ఎస్ ఎన్నారై ప్రతినిధి అనిరుధ్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. తెలంగాణ ఆవిర్భావం, బీఆర్‌ఎస్ రజతోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథులుగా కేటీఆర్, మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, నాయకులు గంగుల కమలాకర్, గాదరి కిశోర్, బాల్క సుమన్ పాల్గొన్నారు.



## నేటి ఆవిర్భావం అదిరేలా...

• బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు

సూర్యాపేట, జూన్ 1 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో పద్నాలుగేండ్లపాటు చేసిన ఉద్యమ ఫలితంగా సాధించిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు సోమవారం ఘనంగా జరుగనున్నాయి. బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయాలు, మున్సిపాలిటీలు, పట్టణ, మండల కేంద్రాల్లో వేడుకలు అదిరిపోయేలా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో జాతీయ జెండా, పార్టీ పతాకాలను ఎగురవేయనున్నారు. సూర్యాపేట జిల్లాలో అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్, నల్లగొండలో రమావత్ రవీంద్రనాయక్, యాదాద్రిభువనగిరి జిల్లాలో రామకృష్ణారెడ్డి జాతీయ జెండాలు ఆవిష్కరించి, స్వీట్ల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నారు. పార్టీ నాయకులు, శ్రేణులంతా పాల్గొనాలని, ప్రజలతో కలిసి అవతరణ వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఆయా జిల్లాల అధ్యక్షులు పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో జంబో స్కీంలు అమలు చేస్తామని ప్రకటించి బొక్కబోర్లా పడింది. జనవరి 26న రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ప్రారంభిస్తామని చెప్పినా ముందుకు సాగలేదు. ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా కేవలం మండలానికి ఒక గ్రామం చొప్పున పైలట్ విలేజీ అంటూ కొత్త ముచ్చటకు తెరలేపారు. ఏవేవో కారణాలు చెప్పి మండలంలో ఒక్క గ్రామానికే పరిమితం చేశారు. ఆ తర్వాత అమలు చేస్తామని చెప్పినా.. ఇప్పటికీ అతీగతీలేదు. ఇప్పుడు కూడా గతంలోని సీన్ రిపీట్ అవుతుండటం విశేషం. అవతరణ దినోత్సవం రోజున పలు పథకాలకు శ్రీకారం చుడుతామని ప్రగల్భాలు పలికి, ఇప్పుడు పథకాలే లేవంటూ తుస్సుమనిపించింది.

# అన్నీ ఉత్త ముచ్చట్లే..!

## తెలంగాణ అవతరణ దినోత్సవం రోజు స్కీంలు అంటూ ఊదరగొట్టిన సర్కారు

- ఒక్క పథకమూ ముందుకురాని దుస్థితి..
- మరోసారి పెండింగ్‌లో పెట్టిన ప్రభుత్వం
- ఇంకా వికసించని 'రాజీవ్ యువ వికాసం'
- రేషన్ కార్డుల పరేషాన్ తీరేదెప్పుడు..?
- ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవమెప్పుడో..?
- జనవరి 26న సేమ్ సీన్ రిపీట్
- నాడు కేవలం పైలట్ గ్రామాలకు పరిమితం




యాదాద్రి భువనగిరి, జూన్ 1 (నమస్తే తెలంగాణ):'జూన్ 2.. పథకాల పెద్ద పండుగ.. మిషన్ 26కు ఆరంభం.. లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లు.. స్కీం సాంక్షన్ ఆర్డర్లు..'' ఇనీ కాంగ్రెస్ సర్కారు ఊదరగొట్టిన ఉత్తుత్త ముచ్చట్లు. రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున కలెక్టరేట్ కార్యాలయాల్లో పలు పథకాలకు శ్రీకారం చుడుతామని ప్రగల్భాలు పలికింది. ఏదో చేసేసినట్లు గొప్పగా ప్రచారం చేసుకున్నది. ఇప్పుడు పథకాల్లేవంటూ చివరికి తుస్సుమనిపించింది. సోమవారం పలు పథకాల ప్రారంభోత్సవాలు వాయిదా పడటంతో పథకాల అమలులో మరింత జాప్యం కానున్నది. జనవరిలోనూ జెండా వందనం రోజు ఇస్తామంటూ నమ్మబలికి.. పైలట్ గ్రామాలతో సరిపెట్టుకున్న విషయం అందరికీ తెలిసిందే.

### రాజీవ్ యువ వికాసం ఎప్పుడో.. ?

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం సబ్సిడీతో కూడిన ఆర్థిక సాయం కోసం రాజీవ్ యువ వికాసం పథకాన్ని తీసుకువచ్చింది. రేషన్ కార్డు కలిగిన బడుగు బలహీన వర్గాల యువతతో పాటు ఈబీసీ, మైనారిటీలకు రూ.50వేల నుంచి రూ.4లక్షల వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. ప్రతి నియోజకవర్గానికీ 4,200 మందికి ఆర్థిక సాయం అందించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాకు 9,188 యూనిట్లు మంజూరు చేశారు. ఉమ్మడి నల్లగొండలో రాజీవ్ యువ వికాసానికి వివిధ వర్గాల నుంచి 1,78,060 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో నల్లగొండలో 79,052, యాదాద్రి భువనగిరిలో 38, 904, సూర్యాపేటలో 60,104 దరఖాస్తులు స్వీకరించారు. మండలాల్లో అధికారులు వెరిఫికేషన్ ప్రక్రియను చేపట్టారు.

### ఊరిస్తున్న ఇందిరమ్మ ఇండ్లు..

కటిక దారిద్ర్య పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మోక్షం కలుగడం లేదు. గూడు కట్టుకుందామనుకున్న పేదల కలలు కల్లగానే మిగిలిపోతున్నాయి. నెలల తరబడి పెండింగ్ పడుతున్న ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ కాపీల పంపిణీలో జాప్యం నెలకొంటూనే ఉన్నది. జిల్లాలో పైలట్ గ్రామాల్లో మొదటి విడతగా 762 ఇండ్లు మంజూరయ్యాయి. వాటి నిర్మాణ పనులు కూడా నత్తనడకన కొనసాగుతున్నాయి. రెండో విడతలో భాగంగా 8,191 మందికి ఇవ్వాల్సి ఉంది. ఇప్పటికే మండలాల వారీగా కేటాయింపులు పూర్తయ్యాయి. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కూడా జాబితాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అయినా జూన్ 2 మాత్రం పథకం అమలుకు నోచుకోవడం లేదు. తుంగతుర్తి ఎమ్మెల్యే మాత్రం తన నియోజకవర్గంలోని ఓ మండలంలో కొందరికి ఇచ్చేందుకు ప్లాన్ చేసినట్లు తెలిసింది.

జూన్ 2న ప్రారంభిస్తామన్న పథకాల్లో మొదటిదైన రాజీవ్ యువ వికాసం అమలుకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదని అధికారులు చెబుతున్నారు.

### రేషన్ కార్డులకు పరేషాన్..

కొత్త రేషన్ కార్డులు సైతం పంపిణీకి నోచుకోవడం లేదు. అసలు ఆదివారం సాయంత్రం వరకు కొత్త కార్డులు ఇంకా జిల్లాకు చేరుకోలేదు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రజాపాలనలో భాగంగా కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో సుమారు 97 వేల అప్లికేషన్లు వచ్చాయి. వీటిలో 45వేలు వెరిఫై చేయగా, కొన్ని వివిధ స్థాయిలో పెండింగ్‌లో ఉన్నాయి. అయితే కొత్త రేషన్ కార్డులు వచ్చిన వారికి కూడా మూడు నెలల సన్నబియ్యం ఇస్తామని ప్రభుత్వం చెబుతున్నా.. అసలు రేషన్ కార్డులే రాకపోవడంతో ఎలా తీసుకుంటారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అంతేకాకుండా ప్రతి పథకానికీ రేషన్ కార్డు ప్రామాణికం కావడంతో ఎప్పుడు ఇస్తారోనని ఎదురు చూస్తున్నారు.

### రైతు భరోసా పూర్తి స్థాయిలో అందేనా..?

కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా పూర్తి స్థాయిలో అమలు చేయ లేదు. యాసంగిలో 50శాతం మందికి మాత్రమే డబ్బులు జమ చేసింది. నాలుగు ఎకరాల వరకు మాత్రమే పథకాన్ని వర్తింపజేసింది. మిగతా డబ్బులు జూన్ 2న బ్యాంక్ ఖాతాల్లో వేస్తామని ప్రకటించింది. సోమవారమైనా రైతుల అకౌంట్లల్లో డిపాజిట్ చేస్తుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే గతేడాది వానకాలం రైతు భరోసా డబ్బులు ఎగ్గొట్టిన విషయం ప్రజలందరికీ తెలిసిందే.



మాట్లాడుతున్న మదర్ డెయిరీ మాజీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేత కల్లూరి రామచంద్రారెడ్డి

## పాడి రైతుల బిల్లులు విడుదల చేయాలి

### బీఆర్‌ఎస్ నేత కల్లూరి రామచంద్రారెడ్డి

ఆలేరు టౌన్, జూన్ 1: మదర్ డెయిరీ (నార్ముల్)లో పాలు పోస్తున్న రైతులకు మూడు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే విడుదల చేయాలని బీఆర్‌ఎస్ నేత కల్లూరి రామచంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మదర్ డెయిరీ మాజీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డితో కలిసి ఆదివారం ఆలేరు పాలశీతలీకరణ కేంద్రంలో మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని మదర్ డెయిరీకి పాలు పోస్తున్న వేలాదిమంది రైతులకు మూడు నెలల నుంచి బిల్లులు ఇవ్వకపోవడంతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి 15 రోజులకు ఒకసారి బిల్లులు ఇవ్వాల్సి ఉండగా మూడు నెలల నుంచి ఇవ్వకుండా మదర్ డెయిరీ చైర్మన్ నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. ఈ నెల 6న ఆలేరు నియోజకవర్గం తుర్కపల్లి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన కోసం వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాలో పాడి రైతులు పడుతున్న ఇబ్బందులు పరిష్కరించాలని కోరారు. జిల్లాకు వచ్చే నాటికి మదర్ డెయిరీ నుంచి రైతులకు మూడు నెలల నుంచి ఇవ్వాల్సిన పాల బిల్లులు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో మదర్ డెయిరీ అభివృద్ధి పురోగమించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దివాళా దిశగా ప్రయాణం చేస్తున్నదన్నారు. మదర్ డెయిరీ అనాలోచిత నిర్ణయాలు పాడి రైతు వ్యతిరేక నిర్ణయాలే ఇందుకు కారణమన్నారు. పాలన చేతకాకుండే దిగిపోవాలని రైతులే మదర్ డెయిరీని నిర్వహిస్తారని వారు పేర్కొన్నారు.



నల్లగొండ ఎస్పీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న శిల్ప తల్లి పద్మ

## సీసీఎస్ సీఐ డానియల్‌ను సస్పెండ్ చేయాలి

నీలగిరి, జూన్ 1: తన కూతురు మృతికి కారణమైన సీసీఎస్ సీఐ డానియల్‌ను సస్పెండ్ చేయాలని మృతురాలి తల్లి పద్మ ఆదివారం రాత్రి నల్లగొండ ఎస్పీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపింది. గతేడాది కుటుంబ సమస్యలతో న్యాయం కోసం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన మహిళతో సీఐ వివాహేతర సంబంధం పెట్టుకున్నట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో అతడిని ఐజీ కార్యాలయానికి అటాచ్ చేసిన విషయం తెలిసిందే. సీసీఎస్ సీఐగా ఉన్న డానియల్ గతనెల 22న పానగల్‌లోని ఛాయా సోమేశ్వర ఆలయానికి రమ్మని చెప్పడంతో తన కుతూరు వెళ్లిందని తెలిపారు. వారు రోడ్డు పక్కన నడుస్తున్న క్రమంలో ద్విచక్ర వాహనం వచ్చి ఆమెను ఢీకొట్టడంతో తీవ్రగాయాలై హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. శిల్పతో సంబంధం పెట్టుకుని కుటుంబం ఛిన్నాభిన్నం చేసి మరణానికి కారణమైన డానియల్‌ను సస్పెండ్ చేయాలని శిల్ప పిల్లలతో కలిసి మృతురాలి తల్లి నిరసన తెలిపింది. ఘటనాస్థలానికి వచ్చిన సీఐ రాఘవరావు న్యాయం చేస్తామనడంతో ఆందోళన విరమించింది. దీంతో తండ్రి గ్రామమైన పిట్టలగూడేనికి మృతదేహాన్ని తరలించారు.

# కేసీఆర్ కలల రూపం మినీ శిల్పారామం

## రాయగిరి చెరువు వద్ద సకల హంగులతో ఏర్పాటు

- బీఆర్‌ఎస్ హయాంలో రూ.5 కోట్లతో రెండెకరాల్లో రూపుదిద్దుకున్న వైనం
- నేడు ప్రారంభించనున్న మంత్రులు



రాయగిరి చెరువు కట్టపై మినీ శిల్పారామం స్వాగత తోరణం

యాదగిరిగుట్ట, జూన్ 1 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని ప్రపంచమే అబ్బురపడేలా తీర్చిదిద్దిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్.. చుట్టుపక్కల ప్రకృతి సంపదను అదేరీతిలో మహాద్భుతం గా రూపొందించారు. ఆయన కలల రూపమే రాయగిరి చెరువుపై కొలువుదీరిన 'మినీ శిల్పారామం.' బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో వైటీడీఏ నిధు లు రూ.5 కోట్లతో రెండెకరాల్లో కొలువుదీరిన శిల్పారామం.. సోమవారం నుంచి లక్ష్మీనృసింహుడిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు చేరువకానున్నది. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం సాయంత్రం 4:30 గంటలకు మంత్రులు జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించనున్నారు.

### ప్రకృతి సంపదకు నిలయం..

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వెళ్లేదారిలో రాయగిరి గ్రామంలో పెద్దచెరువు ఉన్నది. ఇది ఒకప్పుడు కేవలం నీటి నిల్వకు మాత్రమే ఉపయోగపడేది. కానీ, ఇప్పుడు దానిని తొలి సీఎం కేసీఆర్ ఒక అద్భుత పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దారు. వివిధ ప్రాంతాల నుంచి ఆలయానికి సులభంగా చేరేందుకు రహదారి విస్తరణతోపాటు పక్కనే అభయారణ్యాలు నిర్మించారు. వీటికి నృసింహ, ఆంజనేయ అభయారణ్యాలుగా నామకరణం చేశారు. 140 ఎకరాల్లో విస్తరించిన ఆంజనేయ అరణ్యంలో 60 వేల మొక్కలు, 240 ఎకరాల్లో విస్తరించిన నృసింహ అరణ్యంలో 30 వేల మొక్కలు నాటగా.. నేడు అవి ఏపుగా పెరిగి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.150 కోట్లు ఖర్చు చేసి రాయగిరి నుంచి ఆలయం వరకు 6 కిలోమీటర్ల మేర నాలుగులైన్ల రహదారి నిర్మించారు. చెరువులో నాలుగుచోట్ల వాటర్ ఫౌంటెయిన్లు ఏర్పాటు చేశారు. చెరువులో షికారు చేసేందుకు చక్కని బోటింగ్ వ్యవస్థను సిద్ధం చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన లైటింగ్ రాత్రిపూట భక్తులకు మిరుమిట్లు గొలిపేలా ఉన్నది.

### మినీ శిల్పారామం..

రాయగిరి చెరువు అలుగుపోసే ప్రాంతంలో శిల్పారామాన్ని అద్భుతంగా నిర్మించారు. శిల్పారామంలోకి ప్రవేశించే మార్గంలో స్వాగతతోరణం అబ్బురపరుస్తున్నది. పిల్లలు ఆడుకునేందుకు, పెద్దలు సేద తీరేందుకు మైదానాన్ని సిద్ధం చేశారు. ఫుడ్‌కోర్టు ఏర్పాటు చేశారు. చెరువు మధ్యలో ఐలాండ్, పక్కనే వంతెన వంటి నిర్మాణాలకు సన్నాహాలు చేస్తున్నారు. చిన్న, చిన్న కుటీరాల మధ్యలో పిల్లలు ఆడుకునేందుకు, పెద్దలు సేదతీరేందుకు మైదానాన్ని సిద్ధం చేశారు. మధ్యలో ఖాళీ ప్రదేశాల్లో తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే రూపంలో వివిధ ప్రతిమలు తీర్చిదిద్దారు.



రాయగిరి మినీశిల్పారామంలో సేదతీరేందుకు ఏర్పాటు చేసిన కుటీరాలు

# ఉపాధ్యాయుల సర్దుబాటుపై రచ్చ

## సర్కార్ ఉత్తర్వులు విరమించుకోవాలని ఉపాధ్యాయ సంఘాల డిమాండ్

- అనాలోచిత, అశాస్త్రీయ విధానమంటూ ఆగ్రహం
- ఇప్పటికే నల్లగొండ జిల్లాలో మూతపడిన 298 ప్రాథమిక పాఠశాలలు
- తీవ్ర సంఘర్షణలో ఎస్జీటీ ఉపాధ్యాయులు

రామగిరి, జూన్ 1: ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తామని ప్రభుత్వం ఓవైపు ప్రకటిస్తూనే ...మరో వైపు పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్య కుదింపునకు ఉత్తర్వులు జారీచేయడంపై రచ్చ మొదలైంది. ఈనెల 6 నుంచి ప్రారంభమయ్యే బడిబాటతో పలు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేలా ఆయా పాఠశాలల్లోని ఉపాధ్యాయులు తీవ్రమైన కృషి చేస్తారు. అలాంటి సందర్భంలో ..అనాలోచిత, అశాస్త్రీయ విధానంతో పిల్లలు తక్కువగా ఉన్నారనే ఉద్దేశంతో టీచర్లను వేరే పాఠశాలలకు సర్దుబాటు చేయడం సరైనదికాదని ఓవైపు ఎస్జీటీ టీచర్లు, మరోవైపు ప్రధాన ఉపాధ్యాయ సంఘాలు సర్కార్, అధికారుల వైఖరిని తప్పుబడుతున్నాయి. సర్దుబాటు ప్రక్రియ ఈనెల 19లోగా చేయాలని ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొన్నది. సర్కార్ నిర్ణయం ప్రాథమిక పాఠశాలలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉన్నదని, తక్షణమే ఉత్తర్వులు సవరణ చేసి ప్రాథమిక విద్యతోపాటు పాఠశాలలను పరిరక్షించుకోవాలని డిమాండ్ చేస్తుండటం గమనార్హం. బడులు ప్రారంభమైన మరుసటి రోజే కాకుండా జూలై చివరి వారం, ఆగస్టులో సర్దుబాటు ప్రక్రియ చేస్తే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే ప్రభుత్వ, విద్యాశాఖ అనాలోచిత వైఖరితో 298 ప్రాథమిక పాఠశాలలు 2019 నుంచి 2025 విద్యా సంవత్సరం ముగింపునాటికి మూతపడిన విషయం విదితమే. తాజాగా సర్కార్ నిర్ణయంతో ఇంకా పాఠశాలలు మూతపడే అవకాశం ఉండటంతోపాటు గ్రామీణ, పల్లె ప్రాంతాల్లోని బడీడు పిల్లలు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని టీచర్లు, పలు ఉపాధ్యాయ సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.



### సంఖ్య ఆధారంగా నియమించడం అనాలోచితం

ప్రాథమిక పాఠశాలలో ప్రతి తరగతికీ ఒక ఉపాధ్యాయుడు, ఒక తరగతి గది ఉండాలని టీచర్ల సంఘాలు, మేధావులు డిమాండ్ చేస్తున్నారు. అయినప్పటికీ అందుకు భిన్నంగా విద్యార్థుల సంఖ్య ఆధారంగానే ఉపాధ్యాయులను నియమించడం సరికాదు. ఇలాంటి అశాస్త్రీయ, అసంబద్ధ నిర్ణయాలతో ప్రాథమిక పాఠశాలలు నిర్వీర్యమయ్యే ప్రమాదం ఉన్నది. ప్రతి పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని సాక్షాత్తూ విద్యాకమిషన్ సూచించింది. ప్రతి పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలి. 60మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులుంటే పాఠాలు ఎలా బోధిస్తారు. అలాకాకుండా సర్కార్, విద్యాశాఖ .....పుండు ఒకచోట ఉంటే ..మందు మరోచోట రాస్తున్నట్లు ఉన్నది.

**- పి.వెంకులు, డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, నల్లగొండ**

### ఉత్తర్వులు తక్షణం విరమించుకోవాలి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేలా ఈనెల 6 నుంచి ప్రారంభమయ్యే బడిబాటలో ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి పిల్లల నమోదుకు ప్రయత్నిస్తుంటే...అధికారులేమో బడుల్లో టీచర్లు లేకుండా చేసేలా టీచర్ల సర్దుబాటు కోసం ఇచ్చిన ఉత్తర్వులను తక్షణం విరమించుకోవాలి. పాఠశాలలు పునఃప్రారంభం కాగానే టీచర్లు ఉంటేనే పిల్లలను తల్లిదండ్రులు పంపిస్తారు. పిల్లలు చేరిన తర్వాత అప్పటి పరిస్థితుల ఆధారంగా టీచర్ల సర్దుబాటు చేస్తే బాగుంటుంది. జూన్‌లో పాఠశాలలు తెరువగానే మరసటి రోజే సర్దుబాటు చేయాలనే ఉత్తర్వులను వ్యతిరేకిస్తున్నాం. అలాకాకుండా జూలై చివరి వారం లేదా ఆగస్టులో చేస్తే బాగుంటుంది.

**- కాళం నారాయణరెడ్డి, పీఆర్టీయూటీఎస్, పూర్వ జిల్లా ప్రధాన కార్యదర్శి, నల్లగొండ**

### తాజా ఉత్తర్వులతో రచ్చ షురూ...

ఈనెల 12న పాఠశాలలు పునఃప్రారంభమవుతున్నాయి. పాఠశాలలు మొదలైన మరుసటి రోజే పిల్లలు తక్కువ ఉన్న పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 6 నుంచి 19 వరకు బడిబాట నిర్వహించనుండగా దానితో విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నది. మరో వైపు ఉపాధ్యాయులంతా బడిబాట విజయవంతం చేసి, సర్కార్ బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడిస్తున్నారు. బడిబాట ముగిసిన తర్వాత జూలై చివరి వారం, ఆగస్టులో ఉపాధ్యాయుల సర్దుబాటు చేస్తే బాగుంటుందని టీచర్లు పేర్కొంటున్నారు.